క్లుప్తంగా

'నేను ప్లాస్టిక్‌ను కాను'



నిజామాబాద్‌అర్బన్: లయన్ సహారా ఆధ్వర్యంలో ఆర్యనగర్‌లోని మహాలక్ష్మి చికెన్ సెంటర్‌లో మంగళవారం మున్సిపల్ కమిషనర్ మకరంద్ ప్రత్యేక సంచులను విడుదల చేశారు. చికెన్ సెంటర్ 28వ వార్షికోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ సంచులకు బదులుగా 'నేను ప్లాస్టిక్‌నుకాను' అనే నినాదంతో కూడిన 90 రోజులలో కరిగిపోయే సంచులను కమిషనర్ విడుదల చేశారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా కార్యదర్శి చేకూరి ఉదయ సూర్యభగవాన్, కోశాధికారి ధనుంజయరెడ్డి, సభ్యులు కపిల్, రమేష్, షాపుయజమాని గుణ, కాలనీవాసులున్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన



సిరికొండ: మండల కేంద్రంలోని ప్రతిభ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు స్థానిక పెట్రోల్ బంకులో క్షేత్ర పర్యటనకు మంగళవారం వెళ్లారు. పెట్రోల్ పంపులు వినియోగదారులకు అందిస్తున్న సేవలు, పెట్రోల్ నాణ్యత గురించి పంపు మేనేజర్ నర్సయ్య విద్యార్థులకు వివరించారు. కరస్పాండెంట్ సుంకం హరీష్, హెచ్‌ఎం అశోక్, టీచర్లు ప్రీతి, మైనీరెడ్డి, ప్రశాంత్, శశికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా శివప్రసాద్

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ కె.శివప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా కొనసాగిన నాగమోహన్ నుంచి బాధ్యతలను తీసుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌వోడీలు, అధ్యాపకులు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

ఐదో టౌన్ ఎస్సైగా గంగాధర్

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదో పోలీస్ స్టేషన్ ఎస్సైగా గంగాధర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆర్మూర్ ఎస్సైగా గంగాధర్ పని చేశారు. ఐదో టౌన్ ఎస్సైగా ఉన్న వెంకట్రావు ఆరో టౌన్‌కు బదిలీపై వెళ్లారు.

రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలకు ఎంపిక



ధర్పల్లి: హైదరాబాద్ ముచ్చింతలోని చిన్న జీయర్ స్వామి ఆశ్రమంలో సెప్టెంబర్ 2న జరిగే రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలకు ధర్పల్లి లిటిల్ హార్ట్స్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులు డి.అనన్య, పి.వర్షిణి అనే ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్ తెలిపారు. చిన్నజీయర్ స్వామి వారి ప్రజ్ఞా వికాస్ ఆధ్వర్యంలో ఆర్మూర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో ఇద్దరూ ప్రతిభ కనబరిచారు. వ్యాసరచన పోటీల్లో జిల్లా స్థాయిలో గెలుపొంది, రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తున్న సందర్భంగా కరస్పాండెంట్ శ్రీకాంత్, హెచ్‌ఎం సాధన విద్యార్థులను అభినందించారు.

డాక్టరేట్ ప్రదానం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగంలో పరిశోధక విద్యార్థి గాజుల శ్యామ్ కుమార్ పీహెచ్‌డీ డాక్టరేట్‌ను సాధించారు. తెయూ అధ్యాపకులు డాక్టర్ సత్యనారాయణ రెడ్డి మావురపు పర్యవేక్షణలో 'డిజైన్, సింథసిస్ ఆఫ్ నావెల్ హెటిరోసైక్లిక్ సమ్మేళనాలు, యాంటీ క్యాన్సర్ ఏజెంట్లు, వాటి మాలిక్యులర్ డాకింగ్ అధ్యయనాలు' అనే అంశంపై శ్యాం కుమార్ పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథం సమర్పించారు. కళాశాలలో జరిగిన బహిరంగ మౌఖిక పరీక్షకు ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఏ.కృష్ణంరాజు ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించిన శ్యామ్ కుమార్‌ను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

నేడు హెల్మెట్ పై అవగాహన

ఖలీల్‌వాడి: నేడు నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో హెల్మెట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎస్‌ఎస్‌ఏ సూపరింటెండెంట్ పురుషోత్తం గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమానికి జిల్లా జడ్జి సునీతా కుంచాల, సీపీ కల్మేశ్వర్ ముఖ్య అతిథిగా విచ్చేస్తారని తెలిపారు. వాహనాదారులకు హెల్మెట్‌పై అవగాహన కోసం ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు.

రుణమాఫీ అడిగిన రైతుపై చేయిచేసుకోవడం సిగ్గుచేటు

జక్రాన్‌పల్లి : రుణమాఫీపై మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును ప్రశ్నించిన రైతుపై ఆయన చేయిచేసుకోవడం నిజంగా సిగ్గుచేటని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పాట్కూరు తిరుపతిరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఖమ్మంలోనే రైతుకు సంకెళ్లు వేసి తీసుకెళ్తే ఆ ప్రభుత్వాన్ని రైతులు మార్చేశారని గుర్తు చేశారు. మంత్రి తీరును ఖండించారు.



రోడ్డు పక్కనే రక్షణ కవచాలు లేకుండా ఉన్న డి-54 మురికి కాలువ



సాయినగర్‌లో..

రక్షణ కవచాలేవి?

నగరంలో పలు చోట్ల ప్రధాన నాలాలపై రక్షణ కవచాలు లేకపోవడంతో వానా కాలంలో వర్షపు నీరు నిండి లోపలి మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. అలాగే ఈ నాలాలు ప్రమాదాలకు నిలయాలుగా ఉంటున్నాయి. ఇటీవలే నగరంలోని ఆనంద్ నగర్‌లో నాలుగేళ్ల చిన్నారి నాలాలో పడి మృతిచెందింది. భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే నాలాలపై రక్షణ కవచాలు ఏర్పాటు చేయాల్సిందే. మున్సిపల్ అధికారులు స్పందించి ఇళ్ల పక్కన ఉన్న భారీ డ్రైనేజీలపై కవచాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.
– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



ఖిల్లా రోడ్డులో ఇళ్ల పక్కనే రక్షణ లేకుండా..



సూర్యనగర్‌లో..



కోటగల్లీకి వెళ్లే దారిలో..



మాజీ మేయర్ ఇంటికి వెళ్లే దారిలో పూలాంగ్ వంతెన వద్ద..

ఓటరు జాబితాను పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీవో కిరణ్‌కుమార్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో వార్డులవారీగా ఓటరు జాబితాను తయారు చేయాలని ఎంపీవో కిరణ్ కుమార్ సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సెప్టెంబర్ 6న వార్డులవారీగా ఓటరు ముసాయిదా జాబితా వెలువడనున్న నేపథ్యంలో డీపీవో ఆదేశాల మేరకు వీలైనంత త్వరగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల జాబితా దృష్టిలో పెట్టుకుని వార్డులవారీగా ఓటరు జాబితా తయారు చేయాలని సూచించారు. మండలంలో సుమారు 29,950 మంది ఓటర్లు ఉన్నారని, ఒకే ఇంటి నెంబర్‌తో ఉన్న కుటుంబసభ్యులందరూ ఒకే వార్డులో వచ్చేలా జాబితా రూపొందించాలని పేర్కొన్నారు.

'చలో ఎస్‌పీడీ'ని జయప్రదం చేయండి

- ఐఎఫ్‌టీయూ జిల్లా నేత సుధాకర్

డిచ్‌పల్లి: ఈనెల 30న జరిగే చలో ఎస్‌పీడీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ కోరారు. మంగళవారం డిచ్‌పల్లి కేజీబీవీ, మోడల్ స్కూల్ హాస్టల్ వద్ద చలో ఎస్‌పీడీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. కేజీబీవీ, యుఆర్ఎస్, మోడల్ స్కూల్ నాన్ టీచింగ్ స్టాఫ్‌కు, వర్కర్లకు వెంటనే కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని నియమించాలన్నారు. రిటర్మెంట్ వయసును 65 ఏళ్లకు పెంచి బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. ఉద్యోగ, ఆరోగ్య భద్రత, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలన్నారు. వంట పాత్రలు ఇతర సామగ్రి కొత్తవి అందించాలన్నారు. డ్యూటీచార్ట్ అమలు చేసి, పనిభారం తగ్గించాలన్నారు. నాయకులు డి.కిషన్, బి.మురళి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



ధర్పల్లిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ధర్పల్లి: హైదరాబాదులో ఈ నెల 31, సెప్టెంబర్ 1, 2వ తేదీల్లో జరిగే ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) ఏడో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పీవోడబ్ల్యూ జిల్లా నాయకురాలు పద్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో మంగళవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..1974లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థినులు, మహిళల సమస్యల పరిష్కారం కోసం పీవోడబ్ల్యూ ఆవిర్భవించిందని తెలిపారు. ఈ మహాసభలో మహిళలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ, ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని పేర్కొన్నారు.

దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కమిషనర్

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం మున్సిపల్ కమిషనర్ మకరంద్ పర్యటించారు. 19వ డివిజన్ మహాలక్ష్మి దేవాలయంలో డెంగీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అక్కడ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. డెంగీ వచ్చి తగ్గిపోయిన వారి ఇంటి పరిసరాలను పరిశీలించారు. పరిసరాలలో నీరు నిలవ ఉండకుండా జాగ్రత్త పడాలన్నారు. దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు జ్వరం సర్వే నిర్వహించగా.. వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నగర శివారులోని డంపింగ్ యార్డ్‌ను సందర్శించి పరిశీలించారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభుదాస్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కవితకు బెయిల్.. బీఆర్ఎస్ నేతల సంబురాలు



నగరంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో..

సాక్షి నెట్‌వర్క్: ఎమ్మెల్సీ కవితకు లిక్కర్ స్కాం కేసులో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు మంగళవారం సంబురాలు చేసుకున్నారు. వీధుల్లో బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. ఆమె పేరిట పలు ఆలయాల్లో పూజలు చేయించారు.



డిచ్‌పల్లిలో..

కనీస వేతనాలను అమలు చేయాలి



సిరికొండ: ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలతో పాటు ఇతర విద్యా సంస్థల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్, వర్కర్లకు కనీస వేతనాలను అమలు చేయాలని యూనియన్ నాయకురాలు ప్రశాంతి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 30న నిర్వహిస్తున్న చలో ఎస్‌పీడీ ఆఫీస్‌ను విజయవంతం చేయాలన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల వసతి గృహంలో కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. స్వర్ణలత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధుల నియంత్రణ



నిజామాబాద్ రూరల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో తిర్మన్‌పల్లి పరిధిలోని అశోక్ ఫారం కేజీబీవీ పాఠశాలలో సీజనల్ వ్యాధులపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. తిర్మన్‌పల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆశిష్ మాట్లాడుతూ.. పోషకాహారము, పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అఖిల్‌అలీ, ఆరోగ్య పర్యవేక్షకుడు మధుకర్, ఏఎన్‌ఎం శివలీల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రిమీలేయర్ విధానాన్ని అవలంబించాలి



జక్రాన్‌పల్లి : ఎస్సీ వర్గీకరణలో క్రిమీలేయర్ విధానాన్ని అవలంబించాలని దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిన్నెర సిద్ధార్థ డిమాండ్ చేశారు. మంగళవారం బ్రాహ్మణపల్లి పరిధిలో గల గాంధీనగర్‌లో పాదయాత్రలో భాగంగా దళితులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. దళితులలో క్రిమీలేయర్ విధానాన్ని పాటించినట్లయితే ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందన్నారు. లేకపోతే దళితులలో ధనికులు రిజర్వేషన్‌ను వాడుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. దళిత వికాస సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్, దళిత నేతలున్నారు.

న్యాయదేవత న్యాయం చేసింది



నిజామాబాద్ అర్బన్: ఎమ్మెల్సీ కవితకు న్యాయదేవత న్యాయం చేసిందని నిజామాబాద్ బీఆర్ఎస్ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు దాదన్నగారి మధుసూదన్ రావు అన్నారు. మంగళవారం కవిత బెయిలు పిటిషన్ విచారణ సందర్భంగా ఆయన సుప్రీంకోర్టు హాల్‌లో ఉన్నారు. వాదనలు వినిపిస్తున్న సమయంలో అక్కడే ఉండి న్యాయపరమైన అంశాలపై బీఆర్ఎస్ లీగల్ సెల్ అభిప్రాయాలను ఫోన్ ద్వారా వెల్లడించారు. కవితకు బెయిలు మంజూరు కావడం శుభ పరిణామమన్నారు.

యూజీసీ- నెట్ పరీక్షలు ప్రారంభం

నిజామాబాద్‌అర్బన్: యూజీసీ, నెట్ ఫేజ్-2 పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు సెప్టెంబర్ 4 వరకు కొనసాగుతాయి. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ పద్ధతిలో జిల్లా కేంద్రంలోని అర్సపల్లిలో గల ఏవీ ఎంటర్‌ప్రైజెస్ పరీక్షా కేంద్రంలో పరీక్షలు నిర్వహిస్తామని కో-ఆర్డినేటర్ భాస్కర్ తెలిపారు. ఈ పరీక్షలను రెండు షిఫ్టులలో నిర్వహిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తున్నారు. గత జూన్ 18న ఆఫ్‌లైన్‌లో నిర్వహించాల్సి పరీక్ష రద్దు కావడంతో మళ్లీ ఈ పరీక్షను నిర్వహిస్తున్నారు. పరీక్షకు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా 8978198421 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

కేజీబీవీల బదిలీల దరఖాస్తులకు నేడు చివరి తేదీ

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని కేజీబీవీల బదిలీలకు దరఖాస్తులు చేసుకునేందుకు నేడు చివరి తేదీ అని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. బదిలీలు కోరుకునే వారు నేటి మధ్యాహ్నం 2 గంటలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించండి



సమావేశమైన ప్రభుత్వ ఉపాధ్యాయులు

నిజామాబాద్‌అర్బన్: పాత పెన్షన్ విధానానికి కట్టుబడి ఉన్నామని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే దాకా ఉద్యమిస్తామని స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ధర్మేందర్ అన్నారు. మంగళవారం నగరంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో సభ్యత్వ నమోదులో భాగంగా ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తన మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెల్లాల్ శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా ఆర్థిక కార్యదర్శి అఫ్జల్ బేగ్, నగర అధ్యక్షుడు సనావుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగిస్తున్నాం



ధర్పల్లి మోడల్ స్కూల్లో సైన్స్‌ల్యాబ్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే



పెద్దవాల్గోట్‌లో గోదాం ప్రారంభిస్తూ..

ధర్పల్లి: తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని, ప్రజలు కలలు కన్న నిధులు, నీళ్లు, నియామకాలు చేపట్టి రాష్ట్రంలో ప్రజాపాలనను కొనసాగిస్తున్నామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ధర్పల్లి మండల కేంద్రంలో మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి రూ.10 లక్షల వ్యయంతో సీసీ డ్రైనేజ్, మోడల్ స్కూల్లో రూ.18 లక్షలతో సైన్స్ ల్యాబ్ భవన నిర్మాణం, తరగతి గదుల మరమ్మతు పనులకు భూమి పూజ చేశారు. అనంతరం 110 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం విద్య, వైద్య వ్యవస్థలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో ఉన్నత విద్యను అందించేందుకు ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లను 25 ఎకరాల్లో నిర్మించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గానికి స్కూల్ మంజూరైనట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో బాలకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రతి రైతుకు రుణమాఫీ

సిరికొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మేరకు ప్రతి రైతుకు రుణమాఫీ చేస్తామని ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. పెద్దవాల్గోట్, కొండూర్ గ్రామాల్లో పీఏసీఎస్ గోదాములను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. మండల కేంద్రంలో పలువురికి కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు వారి ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై అనవసర విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పని లేదని, సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. డీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్, డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గంగాధర్, పార్టీ మండలాధ్యక్షుడు రవి, తహసీల్దార్ రవీందర్‌రావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేత

సిరికొండ: మండల కేంద్రంతో పాటు గడ్కోల్‌లో పేదలకు ప్రభుత్వం అందజేసిన భూముల విషయంలో అటవీ శాఖ అధికారుల ఇబ్బందులను తొలగించాలని ఎమ్మెల్యే భూపతిరెడ్డికి సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు విన్నవించారు. మండల కేంద్రంలో ఎమ్మెల్యేను వారు కలిసి వినతి పత్రం అందజేశారు. హైకోర్టు తీర్పు ఉన్నా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. నాయకులు రామకృష్ణ, బాబన్న, సాయారెడ్డి, రమేష్, లింబాద్రి, కిషోర్, అనీస్, రాములు, రాజన్న పాల్గొన్నారు.

అటవీ సంపదను సంరక్షించాలి



అవగాహన కల్పిస్తున్న ఫారెస్టు అధికారులు

నిజామాబాద్ రూరల్: అటవీ సంపదను సంరక్షించాలని నార్త్, సౌత్ రేంజ్ ఆఫీసర్లు రవిమోహన్‌భట్, సంజయ్ గౌడ్ పేర్కొన్నారు. మల్కాపూర్ తండాలో గ్రామస్తులకు అటవీ సంపదపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. భావితరాలకు ఆహ్లాదకరమైన వాతావరణం, కాలుష్యరహిత్య ప్రకృతిని అందజేయడానికి అటవీ సంపద ఎంతగానో దోహద పడుతుందన్నారు. అక్రమంగా అటవీసంపదను కొల్లగొడితే చట్టపరమైన చర్యలు తీసుకొని జైలుకు పంపుతామని హెచ్చరించారు. సెక్షన్, బీట్ అటవీశాఖ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇందల్వాయి: 33 కేవీ లైన్ల మరమ్మతుల చేపట్టనున్న కారణంగా సిర్నాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని సిర్నాపల్లి, నల్లవెల్లి, డొంకల్, కొటాల్‌పల్లి గ్రామాల్లో నేటి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పండరినాథ్ మంగళవారం తెలిపారు. ప్రజలు సహకరించాలన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	160
		లైవ్	100
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	74,500	వెండి (కిలో)	90,500
22 క్యారెట్స్	68,727		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	12	24	గాజరుగడ్డ	35	50
బెండకాయ	15	30	పచ్చిమిర్చి	20	40
బీరకాయ	30	50	దోసకాయ	20	40
దొండకాయ	25	50	ఆలుగడ్డ	30	50
బీర్నిసుకాయ	50	70	గోబిగడ్డ	35	50
కాకరకాయ	40	60	గోబిపువ్వు	35	50
వంకాయ	30	50	బీట్‌రూట్	30	50
పాలకూర	40	60	కరివేపాకు	40	60
మెంతికూర	50	80	చామగడ్డ	50	70
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	35	50
పుదీనా	70	90	చిక్కుడుకాయ	35	50
క్యాప్సికం	50	70			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఆయ్ (తెలుగు) - 10.20, 4.20, 10.30 తంగలాన్ (తెలుగు) 1.20, 7.20
స్క్రీన్-2	డిమోంటి కాలనీ-2 (తెలుగు) - 10.25, 10.20, స్త్రీట్-2 (హిందీ) - 1.30, కమిటీ కుర్రోళ్లు (తెలుగు)-4.30 మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం - 7.30
స్క్రీన్-3	స్త్రీట్-2 (హిందీ) - 10.20, 10.20, మారుతీనగర్ సుబ్రహ్మణ్యం (తెలుగు) - 1.20, డిమోంటి కాలనీ-2 (తెలుగు) - 4.20, డబుల్ ఇస్మార్ట్ (తెలుగు) 7.10

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	స్త్రీట్-2 (హిందీ) -10.00, 4.30, 10.50, కమిటీ కుర్రోళ్లు (తెలుగు) - 1.15, 7.45
స్క్రీన్-2	ఏలియన్ రోములస్ (తెలుగు) - 10.15, ఆయ్ - 1.00, తంగలాన్ - 4.05, స్త్రీట్ -2 (హిందీ) - 7.25, మారుతీనగర్ సుబ్రహ్మణ్యం - 10.40
స్క్రీన్-3	డిమోంటి కాలనీ-2 (తెలుగు) - 10.20, 4.40, 10.30, స్త్రీట్-2 (హిందీ) - 1.25, ఏలియన్ రోములస్ (ఇంగ్లీష్) - 7.45
స్క్రీన్-4	వెడింగ్ డైరీస్ (తెలుగు)-10.55, మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం (తెలుగు) - 1.35, 7.40, రేవు (తెలుగు)-4.45, ఇంద్ర (తెలుగు) - 10.50
దేవి	తంగలాన్ (తెలుగు)
నటరాజ్	కమిటీ కుర్రోళ్లు (తెలుగు)
విజయ్	మిస్టర్ బచ్చన్ (తెలుగు)
లలితామహల్	డబుల్‌ఇస్మార్ట్ (తెలుగు)